క్లుప్తంగా

దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత



దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

వంగర: దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత నందిస్తోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు, చేతికర్రలను మంగళ వారం దివ్యాంగులకు అందజేశారు. దివ్యాం గులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంటారన్నారు.

బస్సు యాత్రకు తరలిరావాలి..

రాజాం పట్టణంలో ఈ నెల 16న జరగనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు మండల ప్రజలు పెద్ద ఎత్తున తర లిరావాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు.

అభివృద్ధి పనులపై జెడ్పీ సీఈఓ ఆరా



ఆర్‌బీకే పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, తదితరులు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామం లో జరుగుతున్న అభివృద్ధి పనులపై జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ నిర్మలాదేవి ఆరా తీశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే, సచివాలయ భవనాలను మంగళ వారం వారు పరిశీలించారు. మండలంలో ఎంతమేర పనులు జరిగాయన్నదానిపై ఎం పీడీఓ బాసూరి శంకరరావు వద్ద వివరాలు అడిగితెలుసుకున్నారు. నిర్మాణదశలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తిచేసేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ వి.శ్రీని వాసరావు, పీఆర్‌జేఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

125 మందికి ఉచిత వైద్యసేవలు

రాజాం సిటీ: మండలంలోని శ్యాంపురం గ్రామంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశి బిరం నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యుడు ప్రజ్ఞ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అం దజేశారు. శిబిరంలో సుమారు 125 మంది సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్ కళ్యాణమస్తు దరఖాస్తుల పరిశీలన

రేగిడి: మండలంలో ఖండ్యాం, వెంకటాపురం , ఉనుకూరు, సోమరాజుపేట తదితర గ్రామాల్లో వైఎస్సార్ కళ్యాణమస్తు పథకానికి వచ్చిన దరఖాస్తులను ఏపీఎం గోవిందరావు మంగళవారం పరిశీలించారు. దరఖాస్తుదా రుల అర్హతలపై క్షేత్రస్థాయిలో విచారణ చేప ట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సచివాల యాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సర్పంచ్‌లు గేదెల వెంకటేశ్వరరావు, సవళాపురపు రమేష్ నాయుడు, కింజరాపు సురేష్‌కుమార్, జగ్గు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

రేగిడి: పొదుపు సంఘాలు తీసుకుంటున్న స్త్రీనిధి రుణాలు, పీఎంఈజీపీ రుణాల సకాలం లో చెల్లించాలని, వాటిలో అవకతవకలు లేకుం డా చూడాలని సీసీలకు వైఎస్సార్ క్రాంతి పథ ం ఏసీ చిరంజీవి సూచించారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో మంగళవారం సీసీలతో సమావేశం నిర్వహించారు. గ్రామాలు వారీగా రుణాల రికవరీ, బ్యాంకు చెల్లింపులపై ఆరాతీ శారు. పేటీఎంల వినియోగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం గోవింద రావు, మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఎకరాకు 30 బస్తాల దిగుబడి

రేగిడి: మండలంలోని కొండలమామిడివలస గ్రామంలో బావిశెట్టి అప్పన్న, ఆగుల నాగ న్నకు చెందిన పంటపొలంలో మంగళవారం పంటకోత ప్రయోగాలు చేపట్టారు. 5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రయోగాలు చేపట్టగా 19.400 కిలోల దిగుబడి వచ్చినట్లు అధికా రులు లెక్కించారు. ఈ లెక్కన ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. మండలంలో 18 పంటకోత ప్రయోగాలు పూర్తయినట్లు చెప్పారు.

పన్నుల వసూలు వేగవంతం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని ఆస్తి పన్ను వసూళ్లను ముమ్మరంగా చేపడుతు న్నామని ఇన్‌చార్జి కమిషనర్ ఎంపీ నాగరాజు తెలిపారు. మంగళవారం పలు వాణిజ్య సము దాయాలతో పాటు ఆస్పత్రుల యాజమా న్యాల నుంచి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించేందుకు ముందుకు రావాలని కోరారు. పన్ను వసూళ్లకు డ్రైవ్‌ను కొనసాగి స్తామని వ్యాపార సముదాయాలతో పాటు ఇంటి పన్నులు కూడా చెల్లించాలని అన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

మెంటాడ: అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని డీటీఎఫ్ సీఐ ఎన్. రాజేశ్వరి హెచ్చరించారు. విజయనగరం ఏఎస్పీ ఎస్.వెంకటరావు ఆదేశాల మేరకు మండలంలోని చింతాడవలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన తనిఖీలలో ఓ వ్యక్తి నుండి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి



బొబ్బిలి: జగన్నాథపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న శంబంగి వేణుగోపాలనాయుడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని, అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. బొబ్బిలి, మెంటాడ, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డులను ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజ లకు వివరించారు. సంక్షేమం, అభివృద్ధి ఇదే విధంగా కొనసాగాలంటే రాష్ట్రా నికి మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



మెంటాడ: ఆగూరులో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, తదితరులు



బాడంగి: కోడూరులో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు



రామభద్రపురం: రామభద్రపురం సచివాలయ-3 వద్ద సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి



తెర్లాం: ఎం.ఆర్.అగ్రహారం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు



రాజాం: బొద్దాంలో అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ శంకరరావు, తదితరులు



బొబ్బిలి: కంచరవీధిలో సీఎం జగన్‌చిత్రపటాన్ని చూపుతున్న మహిళలు

సామాజిక బస్సుయాత్రను విజయవంతం చేయాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు



సంతకవిటి: సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, వేదికపై ఎమ్మెల్యే జోగారావు, తదితరులు

సంతకవిటి: రాజాంలో ఈనెల 16న వైఎస్సార్‌సీపీ చేపడుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీని వాసరావు పిలుపునిచ్చారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మండలంలో అన్ని పంచాయతీ లకు చెందిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధు లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అన్ని విధాలా అభివృద్ధి చెందారని గుర్తుచేశారున. ప్రభు త్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన లబ్ధిదారులం తా బస్సు యాత్రలో పాల్గొనేలా గ్రామాల్లో ప్రజ లకు అవగాహన కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి మాట్లాడుతూ.. రాజాం లో జరిగే బస్సు యాత్రతో ఈ ప్రాంతంలో వైఎస్సా ర్‌సీపీ గెలుపు ఖాయం అనేలా పార్టీ అధిష్టానికి సం కేతాలు పంపాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, కళిం గ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినా యుడు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయు డు, సర్పంచ్‌లు సిరిపురపు హరిబాబు, డోల తిరుప తి, పండు రాజగోపాలనాయుడు, మాజీ వైస్ ఎం పీపీ గంగ్రేటి కేసరి పాల్గొన్నారు.

స్థల పరిశీలన

రాజాం: మండలంలో బొద్దాం గ్రామంలో వైఎస్సా ర్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబం ధించి ప్రెస్ మీట్ నిర్వహించనున్న ప్రాంతాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం పరి శీలించారు. గ్రామంలోని రజకవీధి సమీపంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ప్రెస్‌మీట్ నిర్వహించేందుకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలి

రాజాం: రాజాంలో ఈనెల 16న నిర్వహించే వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర లో పట్టణానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కం బాల జోగులు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయం లో మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వం ఆయా సామాజిక వర్గాలకు చేసిన మేలును ప్రజలకు వివరించడంతో పాటు ప్రతీ వార్డు నుంచి అన్ని సామాజిక వర్గాల వారు యాత్రలో పాల్గొనేలా స్థానిక నేతలు బాధ్యత తీసు కోవాలని సూచించారు. పార్టీ ఎస్సీ సెల్ జోన్ -1 ఇన్‌చార్జ్ కంబాల సందీప్, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, శాసపు వేణుగోపాలనాయుడు, తిరుమలరావు, దూబ గోపాలం, కలమట శంకర్, ముగడ రవి, పాలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రామభద్రపురం: గ్రామాల్లోని పేదల ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిం చిందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి యాజమాన్యం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబి రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అలాగే ఆ ఆస్పత్రి యాజమాన్యం వైద్యసేవల నిమిత్తం ఉచిత రవాణా సదుపాయం కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేట్ ఆస్ప త్రుల యాజమాన్యాలు పెద్దమనసుతో పేదలకు వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎండీ డి.రమేష్, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పత్తిగుళ్ల ఏక్‌నాథ్, వైద్యాధికారులు చక్రవర్తి, హరిజన్, వెం కట్, ప్రసన్నకుమార్, సునీల్, ఆస్పత్రి హెడ్ బాలభార్గవి పాల్గొన్నారు.



శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ లక్ష్మణరావు

నూతన కమిటీ నియామకం

వంగర: మండలం సంగాంలో వెలసిన సంగమేశ్వర స్వామి ఆలయ కార్తీక మాస ఉత్సవ కమిటీ సభ్యు లను నియమిస్తూ ఎండోమెంట్ రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వులు జారీచేసిందని ఆలయ ఈఓ టి.శివకేశవ రావు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆలయ కమిటీ కాలపరిమితి పూర్తి కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కమిటీలో బోను నాగరాజు, గొర్లె సంగంనాయుడు, శీరాపు సత్యవతి, దత్తి వినోధిని, ఉయ్యాల రూపావతి, సిద్ది నాగమణి, సుఖవాసి ఎరుకునాయుడు, సిద్ధాం తం గణపతిరావుకు కమిటీలో చోటు లభించింది. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీకి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాలలే దేశ భవిష్యత్

నేటి బాలలే రేపటి పౌరులు.. దేశ భవిష్యత్తు అని పలువురు వక్తలు అన్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు పాఠశా లలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుని కొనియాడారు. బాలల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్, బొబ్బిలి, రాజాం



తెర్లాం: తహసీల్దార్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రత్నకుమార్, సిబ్బంది



బాడంగి: బాడంగి గురుకుల పాఠశాలలో చిల్డ్రన్స్ డే వేడుకలు



బొబ్బిలి: నరేంద్రదేవ్ పాఠశాలలో విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ బాబు, ఉపాధ్యాయులు



బొబ్బిలి: పాత బొబ్బిలిలో దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు



వంగర: అరసాడ అంగన్‌వాడీ కేంద్రంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్



రాజాం సిటీ: జానపద గీతానికి నృత్యం చేస్తున్న చిన్నారులు



రాజాం: పెనుబాక యూపీ స్కూల్‌లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం మహేశ్వరరావు, ఉపాధ్యాయులు



రాజాం సిటీ: డోలపేట జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు



రేగిడి: కేజీబీవీలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్ఓ లక్ష్మి



సంతకవిటి: చిల్డ్రన్స్ డే సందర్భంగా సిరిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సమష్టికృషితోనే ప్రగతి సాధ్యం



జెండా ఎగురవేస్తున్న సంఘ చైర్మన్ రామచంద్రరావు, తదితరులు

మెంటాడ: మండల కేంద్రంలో ఉన్న సహకార సం ఘ బ్యాంకు అభివృద్ధి అందరి సమష్టికృషితోనే సాధ్యపడుతుందని చైర్మన్ తాడ్డి రామచంద్రరావు అన్నారు. మంగళవారం బ్యాంకు ఆవరణలో 70వ అఖిల భారత సహకార సంఘ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. సహకార సంఘం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు, చిరు వ్యాపారులకు, మహిళలకు రుణా లను అందించి వారి జీవనోపాధికి మార్గం చూపడం జరిగిందన్నారు. ఆనాడు చిన్నపాటి పెట్టుబడితో ప్రారంభమైన బ్యాంకు నేడు వేలకోట్ల రూపాయల టర్నోవర్‌తో వందల సంఖ్యలో శాఖలుగా విస్తరిం చిందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు చిట్టి రాజు, తిరుపతి, సీఈఓ ప్రసాద్, స్థానిక నాయకులు నారాయణరావు, గంగ్రేటి అప్పలనాయుడు, పరదే శి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

దారిమళ్లిన సిమ్మెంట్ లెక్కలు తేల్చాలి

- మండల సమావేశంలో సభ్యులు డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

వంగర: మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనులకు మంజూరైన సిమ్మెంట్ బస్తాలు లెక్కలు తేల్చాలని సభ్యులు డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు నిర్మాణానికి మంజూరైన 6వేల సిమ్మెంట్ బస్తాలు దారిమళ్లాయని, తమ గ్రామాల అభివృ ద్ధికి మంజూరైన సిమ్మెంట్ బస్తాలు తమకు అంద లేదని సభ్యులు ధ్వజ మెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్‌శాఖ పనితీరుపై జరిగిన సమీక్షలో రాజులగుమ్మడ, మద్దువలస, ఓనెఅగ్రహారం తదితర గ్రామాలకు మంజూరైన సిమ్మెంట్ బస్తాలు తమకు అందలేదని, దీనిపై దర్యాప్తు చేపట్టాలని సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దీనిపై స్పందించి సంబంధిత శాఖ జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి పూర్తి సమాచారం అందించాలని కోరారు. మద్దువలస ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా రబీ పంటలకు సాగునీరం దించలేమని ప్రాజెక్టు అధికారులు చెప్పడంతో అధి కారుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. వంగర మండలంలోని ఆయకట్టు భూములకు సాగునీరం దించకుండా దిగువ ప్రాంతాలకు సాగునీటి సర ఫరా చేయడం పట్ల ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, అరసాడ సర్పంచ్ లచ్చుభుక్త సత్యనారా యణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వే పూర్తయిన ప్పటికీ వన్‌బీ ఆన్‌లైన్‌లో రావడం లేదని వైస్ ఎం పీపీ కిమిడి ఉమామహేశ్వరరావు రెవెన్యూ అధికా రులను ప్రశ్నించారు. బంగారువలస నుంచి విశా ఖపట్నం వెళ్లే నైట్‌హాల్ట్ బస్సు సర్వీసును పునరుద్ద రించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధి కారులను కోరారు.

ప్రతీ ధాన్యం గింజ కొనుగోలుకు చర్యలు

రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎంపీ బెల్లాన చం ద్రశేఖర్ అన్నారు. వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ధాన్యం అమ్మకానికి రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అధికా రులను ఆదేశించారు. బంగారువలస–విశాఖప ట్నం నైట్‌హాల్ట్ బస్సు పునరుద్ధరణకు ఆర్టీసీ అధికా రులతో మాట్లాడుతానని అన్నారు. పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీలు కిమిడి ఉమామహేశ్వరరావు, పున్నాన సత్యనారా యణ, ఎంపీడీఓ హెచ్.హనుమంతురావు, తహ సీల్దార్ బూరాడ సుందరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తకపఠనం ఆవశ్యకతను వక్తలు విద్యార్థులకు వివరించారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థు లకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమ తులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– సాక్షి బొబ్బిలి, రాజాం



రాజాం: స్థానిక శాఖ గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ సాయికుమార్, తదితరులు



రేగిడి: స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శనరావు



రాజాం సిటీ: కంచరాం ప్రజా గ్రంథాలయంలో యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు



రామభద్రపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, గ్రంథాలయ నిర్వాహకులు సత్యవాణి



బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేసి వారోత్సవాలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, సర్పంచ్ కండి రమేష్, తదితరులు



తెర్లాం: తెర్లాం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించిన లైబ్రేరియన్ కృష్ణమూర్తి



వంగర: వంగరలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న గ్రంథాలయ అధికారి జి.వి.రమణమూర్తి, పాల్గొన్న విద్యార్థులు

వసతిగృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

బొబ్బిలి: వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల సంక్షేమమేపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కలువరాయి బీసీ వసతిగృహ సంక్షేమాధికారి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బొత్స నట రాజ్ అన్నారు. వసతిగృహ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించాల ని, జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాటూరి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నటరాజ్, తదితరులు

జెడ్పీ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

సంతకవిటి: మండలంలో బొద్దూరు గ్రామ సచివాల యాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. సచి వాలయ ఉద్యోగులు వద్ద వివరాలు సేకరించారు. వలంటీర్లతో మాట్లాడి, బాగా సేవలు అందించాలని సూచించారు. సకాలంలో సచివాలయాన్ని నిర్మించి, ప్రభుత్వానికి అందించిన పంచాయతీ సర్పంచ్ గేదెల బాబూరావునాయుడు అభినందించారు.

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం సం దర్శించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. మందరాడ, గోళ్లవలస, జావాం, కృష్ణంవలస, కొండగూడేం గ్రామాలకు చెందిన ప్రజలు వినతులు అందజేశారు. ఇనాం భూములకు సాగుపట్టాలు ఇప్పించాలని గోళ్లవలస గ్రామస్తులు కోరారు. కొండగూడేం, కృష్ణంవలస గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు వినతి అందజేశారు. ఇళ్ల స్థల పట్టాలు ఇవ్వాలని మందరాడ కాలనీవాసులు కోరారు. ఆయన వెంట ఎమ్మెల్యే కంబాల జోగులు, నవరత్నాల రాష్ట్ర వైస్ చైర్మన్ నారాయణమూర్తి, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపు రపు జగన్మోహనరావు, తదితరులు ఉన్నారు.



సచివాలయ ఉద్యోగుల నుంచి వివరాలు సేకరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చోరీలపై అప్రమత్తం

బాడంగి: జిల్లాలో చెడ్డి గ్యాంగ్ తిరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమ య్యారు. మండలంలోని అన్ని సచివాలయాల పరి ధిలో సేవలందిస్తున్న మహిళా పోలీసులు, ప్రజలను అప్రమత్తం చేశారు. స్థానిక పోలీస్ కౌన్సిలింగ్ హాల్‌లో మంగళవారం మహిళా పోలీసు లతో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఏఎస్సై డి.కొండలరావు కోరారు.